సాక్షి
జగిత్యాల
శనివారం ¡ 4 ¡ జనవరి ¡ 2025



పోచమ్మతల్లికి బోనం

రాయికల్: మండలంలోని చింతలూరులో శుక్రవారం పోచమ్మతల్లికి మహిళలు బోనాలు సమర్పించారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆలయంలో పూజలు చేశారు.



గుట్టు విప్పేదెప్పుడో..?

పెద్దాపూర్ గురుకులంలో జరిగిన ఘటనలపై అధికార యంత్రాంగం గుట్టు విప్పేందుకు సరైన రీతిలో స్పందించడంలో లేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
29.0/13.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. సాయంత్రం చలి తీవ్రత పెరుగుతుంది.

ఆర్టీసీ ఓవర్‌లోడ్

విరుగుతున్న పట్టీలు.. అరుగుతున్న టైర్లు

- మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన ప్రయాణికుల రద్దీ
- ఒక్కోదాంట్లో వంద మందికి పైగా ప్రయాణం
- నెలలో మరమ్మతుకు 100కు పైగా బస్సులు
- టికెట్లు ఇచ్చేందుకు కండక్టర్ల తిప్పలు
- తగ్గిన అద్దె బస్సుల సంఖ్య
- కరీంనగర్ రీజియన్‌లో పరిస్థితి



కరీంనగర్ బస్టాండ్‌లో పోటీ పడి బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలన్న ఉద్దేశంతో అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం ఆర్టీసీకి భారంగా మారింది. పథకం ప్రారంభం తర్వాత బస్సుల్లో ప్రయాణికులు రద్దీ పెరిగింది. సిట్టింగ్ కెపాసిటీ కంటే రెండింతలకు పైగా ప్రయాణం చేస్తుండటంతో బస్సులకు తరచూ మరమ్మతు చేయాల్సి వస్తోంది. 50 మంది ప్రయాణించాల్సిన బస్సులో 100 మందికి పైగా రాకపోకలు సాగిస్తున్నారు. ఓవర్‌లోడ్ సమస్యతో ప్రయాణికులు, ఆర్టీసీ యాజమాన్యం సైతం ఇబ్బందులకు గురవుతోంది.

కరీంనగర్✍:

మహాలక్ష్మి పథకానికి ముందు ప్రతీరోజు కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 2.50 లక్షలకు పైగా ప్రయాణికులు బస్సుల్లో వెళ్లేవారు. ఇప్పుడు ఆ సంఖ్య రెట్టింపు అయ్యింది. గతంలో రూ.కోటి నుంచి రూ.1.20 కోట్ల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం రూ.2 కోట్లపైనే వస్తుండటం విశేషం. 09 డిసెంబర్ 2023 నుంచి ఇప్పటివరకు రీజియన్ వ్యాప్తంగా 16.17 కోట్ల మంది ప్రయాణించారు. వీరిలో మహిళలే 11.11 కోట్ల మంది. 11 డిపోల పరిధిలో నిత్యం 800కు పైగాబస్సులు తిరుగుతున్నాయి. ఏడాది వ్యవధిలో రూ.876.39 కోట్ల ఆదాయం రాగా, 'మహాలక్ష్మి' ద్వారా రూ.445.63 కోట్లు(51 శాతం) సమకూరడం గమనార్హం. అయితే ప్రయాణికుల సంఖ్య రెట్టింపు కావడంతో బస్సులు రిపేర్‌కు వచ్చి ఎక్కడిక్కడ ఆగిపోతుండటం ఇబ్బందిగా మారింది.

మైలేజీ తక్కువ..

ఒక్కో బస్సులో అధిక సంఖ్యలో ప్రయాణికులు వెళ్తుండటంతో వాటి పట్టీలు తరచూ విరిగిపోతున్నాయి. టైర్లు తొందరగా అరిగిపోతున్నాయి. మైలేజీ సైతం తక్కువగా వస్తోంది. దీంతో సంస్థకు అదనపు భారం పడుతోంది. మెకానిక్‌లు ఎప్పటికప్పుడు బస్సులను రిపేర్ చేయలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో నెలకు 50 బస్సులకు మరమ్మతు చేయాల్సి రాగా, ప్రస్తుతం ఆ సంఖ్య 100కు పైగా పెరిగినట్లు సమాచారం.

కండక్టర్లు, డ్రైవర్లతో గొడవ..

ప్రయాణికుల రద్దీతో కండక్టర్లు, డ్రైవర్లు అష్టకష్టాలు పడుతున్నారు. కండక్టర్లు బస్సు మొదటి నుంచి చివరి వరకు వెళ్లి, టికెట్ ఇచ్చే పరిస్థితి లేకుండా పోతోంది. కండక్టర్లు, డ్రైవర్లతో ప్రయాణికులు తరచూ గొడవలకు దిగుతున్నారు. సీట్ల కోసం పోటీ పడుతూ వారిలో వారే దూషించుకుంటున్నారు.

ఏడాదిలో రీజియన్ పరిధిలోని డిపోలవారీగా ఆదాయ వివరాలు

డిపో	ఆదాయం (రూ.లక్షల్లో)	మొత్తం ప్రయాణికులు	మహిళలు	మహాలక్ష్మి ఆదాయం (రూ.లక్షల్లో)
గోదావరిఖని	13,633.67	2,42,04,921	1,63,77,066	6,751.51
హుస్నాబాద్	4,234.47	1,10,52,288	76,40,424	2,566.95
హుజూరాబాద్	5,873.44	1,28,92,746	84,93,907	3,419.33
జగిత్యాల	11,912.87	2,19,55,251	1,54,71,192	6,073.82
కరీంనగర్-1	9,807.57	1,53,25,489	96,95,481	3,534.78
కరీంనగర్-2	10,412.20	1,76,19,312	1,13,83,867	4,785.71
కోరుట్ల	6,455.91	1,18,15,198	88,50,895	3,434.59
మంథని	5,573.88	87,72,558	58,75,482	3,139.79
మెట్‌పల్లి	5,981.04	1,18,93,086	89,12,298	3,677.85
రాజన్నసిరిసిల్ల	6,614.02	1,24,19,063	81,01,765	3,382.74
వేములవాడ	7,140.83	1,38,17,962	1,03,18,114	3,796.41

సమస్యలు పరిష్కరించాలి

అద్దె బస్సుల యాజమానులు చాలా సమస్యలతో పోరాడుతున్నారు. మహలక్ష్మి పథకం వచ్చిన తర్వాత బస్సులు తరుచూ రిపేర్లకు గురవుతున్నాయి. ప్రభుత్వం ఉపశమనం కోసం రూ.5 వేలు పెంచినా ఏమాత్రం సరిపోవడం లేదు. డ్రైవర్లు సైతం జీతాలను పెంచారు. డ్రైవర్ల ఇబ్బంది కూడా ఉంది. టైర్లు సంస్థ నుంచి ఇప్పించాలి. ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చేవాటిలో కట్ చేసుకొని టైర్లు ఇవ్వాలి.

– పులి ప్రసాద్, అద్దె బస్సుల సంఘం అధ్యక్షుడు

అదనపు బస్సులు నడిపిస్తాం



ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తాం. రీజియన్ పరిధిలో కొంతమేర ఓవర్‌లోడ్ సమస్య ఉంది. ఆయా రూట్‌లలో అదనపు బస్సులు నడిపిస్తాం. 70 ఎలక్ట్రిక్ బస్సులు వచ్చాయి. వాటిని కూడా తిప్పుతాం. ఇప్పటికే ఎక్స్‌ప్రెస్, లగ్జరీ బస్సులను పెంచాం. మహాలక్ష్మి పథకం ప్రారంభించాక ప్రయాణికుల సంఖ్య, ఆదాయంలో హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్‌ల తర్వాత కరీంనగర్‌దే అగ్రస్థానం.

– రాజు, ఆర్‌ఎం, కరీంనగర్

400కు తగ్గిన అద్దె బస్సులు

మహాలక్ష్మి పథకం ప్రారంభించిన తర్వాత అద్దె బస్సుల సంఖ్య తగ్గింది. గతంలో కరీంనగర్ రీజియన్‌లో 800కు పైగా తిరగగా.. ప్రస్తుతం 400కు తగ్గాయి. రోజువారీ రిపేర్లు వస్తుండటంతో వీటి సంఖ్య కూడా క్రమంగా తగ్గుతోంది. ప్రభుత్వం అద్దె బస్సులకు రూ.5 వేలు పెంచినా ఏమాత్రం సరిపోవడం లేదని వాటి యాజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

షెడ్డుకే పరిమితం



రీజియన్ పరిధిలో కొన్ని బస్సులకు కాలపరిమితి ఉన్నా.. అధిక సంఖ్యలో ప్రయాణికులను తీసుకెళ్లడంతో రిపేర్లకు గురై, షెడ్డుకే పరిమితమయ్యాయి. కరీంనగర్, తదితర రూట్‌లలో నడిచే నాన్‌స్టాప్ మినీ బస్సులు తరచూ మరమ్మతుకు గురవుతున్నాయి. మరోవైపు అధికారులు స్పందించి, బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రెండు రోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): రెండురోజుల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ, తప్పులు లేకుండా పకడ్బందీగా సర్వే చేయాలని సూచించారు. అనంతరం మండలంలోని అమ్మక్కపేట గ్రామంలో వైకుంఠధామం, నర్సరీని పరిశీలించారు. వైకుంఠధామంలో పిచ్చి మొక్కలు తొలగించి పూలమొక్కలు పెంచాలన్నారు. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా 2 పూటల నీళ్లు పట్టాలని సూచించారు. మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఏపీవో కొమురయ్య, ఆర్‌ఐలు రేవంత్‌రెడ్డి, రమేశ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మరిన్ని సేవలు అందించాలి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జడ్జి నీలిమ

జగిత్యాలజోన్: జిల్లా అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా న్యాయవాదులకు మరిన్ని సేవలు అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ అన్నారు. అడ్వకేట్ వెల్ఫేర్ సొసైటీ రూపొందించిన 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. సొసైటీ ద్వారా న్యాయవాదులకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బండ భాస్కర్‌రెడ్డి, మారిశెట్టి ప్రతాప్, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డబ్బు లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, పీపీ జంగిలి మల్లికార్జున్, ఏజీపీ ఓంప్రకాష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

చైనా మాంజా వినియోగిస్తే చర్యలు



అశోక్‌కుమార్, ఎస్పీ

జగిత్యాలక్రైం: సంక్రాంతి పండుగ సందర్భంగా గాలి పటాలు ఎగరేసేందుకుని షేధిత చైనా మాంజా వినియోగించినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మాంజాలో ఉపయోగించే గాంజా పూత రాసిన నైలాన్, సింథటిక్ ధారాలు పక్షులు, పర్యావరణానికి, మనుషులకు హాని చేస్తాయని పేర్కొన్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలో చైనా మాంజా ఉపయోగించడం పూర్తిగా నిషేధించడం జరిగిందన్నారు. చైనా మాంజాను ఎవరైనా తయారుచేసినా, విక్రయించినా డయల్ 100కు సమాచారం అందించాలన్నారు.

ఆర్థిక పరిపుష్టి సాధించాలి



మనోజ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సభ్యులు

జగిత్యాలఅగ్రికల్చర్: సహకార సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని జిల్లా సహకార అధికారి సీహెచ్ మనోజ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ సొసైటీలో శుక్రవారం కామన్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించి, 2025 క్యాలెండర్ ఆవిష్కరించారు. జిల్లాలోని చాలా సంఘాలు విత్తనాలు, ఎరువుల అమ్మకానికే పరిమితమవుతున్నాయని, ఆర్థికంగా ఎదిగేందుకు వ్యాపారాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. కేడీసీసీ జగిత్యాల శాఖ మేనేజర్ మోయిజ్ పాషా, సంఘ కార్యదర్శి శంకర్, అధ్యక్షుడు సందీప్‌రావు, ఉపాధ్యక్షుడు నల్లపు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

బోర్నపల్లి వంతెనకు రూ.17.50 కోట్లతో ప్రతిపాదనలు

సాక్షి స్పందన

రాయికల్(జగిత్యాల): మండలంలోని బోర్నపల్లి వంతెన నిర్మాణం కోసం ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు రూ.17.50 కోట్ల నిధుల వ్యయం అంచనావేసి సీఎం చొరవతో బడ్జెట్ ప్రతిపాదనలు పంపించినట్లు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈనెల 2న 'సాక్షి'లో 'బోర్నపల్లి వంతెనకు మోక్షమెప్పుడో' శీర్షికన ప్రచురించిన కథనానికి ఎమ్మెల్సీ స్పందించారు. బ్రిడ్జితో పాటు, బీటీరోడ్డు నిర్మాణం కోసం రూ.17.50 కోట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారని, ఈ బడ్జెట్‌లో నిధులు విడుదలవుతాయని పేర్కొన్నారు. దీంతో గిరిజనుల చిరకాల వాంఛ నెరవేరుతుందన్నారు. దీనికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చౌకధరల దుకాణాల తనిఖీ

జగిత్యాలరూరల్: రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా సివిల్‌సప్లై అధికారి జితేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని పలు చౌకధరల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం కేటాయించిన విధంగా లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫోర్టిఫైడ్ బియ్యంపై కార్డుదారులకు అవగాహన కల్పించారు. రేషన్ డీలర్లు సమయపాలన ప్రకారం సరుకులు పంపిణీ చేయడంతో పాటు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు.

కొండగట్టు ఈవో బదిలీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న ఆలయ ఈవో రామకృష్ణారావు సికింద్రాబాద్ గణేశ్ టెంపుల్ ఈవోగా శుక్రవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సత్కరించి అభినందనలు తెలిపారు.

సావిత్రీబాయి ఆశయ సాధనకు కృషి



సావిత్రీబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్, అదనపు కలెక్టర్ లత తదితరులు

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: సావిత్రీబాయి పూలే ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహిళా విద్యకు సావిత్రీబాయి ఆద్యురాలిగా నిలిచారని, వారి త్యాగాలు మరువలేనివన్నారు. సమాజంలో చారిత్రాత్మక మార్పునకు పునాది వేశారన్నారు. అనంతరం మహిళ ఉపాధ్యాయులు, ఎంఈవోలను సత్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఏవో హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయికల్‌లో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికే 90 శాతం మంది రైతులకు రుణమాఫీ చేశారని, మరికొద్ది రోజుల్లోనే ప్రభుత్వ నిబంధనల ప్రకారం రుణమాఫీ చేస్తారని తెలిపారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణలో రుణమాఫీ, రైతు భరోసా కింద ఎకరాకు రూ.7,500 ఇస్తున్న ఘనత సీఎందేనని గుర్తుచేశారు. ప్రతిపక్షాలైన బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పంట సాగు చేస్తున్న ప్రతీ రైతుకు ఈనెల 15 నుంచి ఎకరాకు రూ.7,500 అందిస్తున్నామని, దీని కోసం రైతులు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అల్లీపూర్ మండల కేంద్రం ఏర్పాటుకు త్వరలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు గోపి రాజిరెడ్డి, మ్యాకల రమేశ్, మహిపాల్‌రెడ్డి, బాపురపు నర్సయ్య, ఆంజనేయులు, షాకీర్, దివాకర్‌రెడ్డి, దాసరి గంగాధర్, గుమ్మడి సంతోష్, ఏలేటి జలేందర్‌రెడ్డి, మండ రమేశ్, బత్తిని భూమయ్య పాల్గొన్నారు.

అవినీతి జరిగితే విచారణ జరిపించండి

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: రోళ్లవాగు ప్రాజెక్ట్‌పై అవినీతి జరిగితే విచారణ జరిపించాలని, కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గోదావరి నీరు విడుదల చేయించాలని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో మాట్లాడారు. 2016లో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఉమ్మడి సారంగాపూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్ట్‌ను ఆధునీకరించడం జరిగిందన్నారు. పావు టీఎంసీ నుంచి ఒక టీఎంసీ వరకు సామర్థ్యం పెంచి, 17 వేల ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 ఏళ్ల అధికారంలో ఉన్నా రైతులకు సాగునీరు అందించలేకపోయిందని ఆరోపించారు. అలాగే జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో గోదావరి నదిపై ఎత్తిపోతల పథకాల ద్వారా పంటలకు నీరు అందించడం జరుగుతుందన్నారు. రోళ్లవాగు ప్రాజెక్ట్‌లో అవినీతి జరిగిందని పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని, జరిగితే విచారణ జరిపించాలన్నారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి నిరంతర కృషి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


జగిత్యాల: పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న చెరువుల్లో మురికినీరు చేరకుండా ఎఫ్‌టీపీల ఏర్పాటుకు రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 16, 1వ వార్డుల్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంపీ అర్వింద్ సహకారంతో జగిత్యాలలో కేంద్రియ విద్యాలయం, ఏకలవ్య పాఠశాల, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటవుతాయని పేర్కొన్నారు. తడి, పొడి చెత్త వేరుచేయడం, ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు కూసరి అనిల్, రాజేశ్ పాల్గొన్నారు.

'ఎత్తి'పోయిన ఆశలు

- గోదావరిలో అడుగంటిన జలం
- నదిలో ఎత్తిపోతలకు సరిపోని నీరు
- నాలుగు మండలాల్లో యాసంగి సాగు ప్రశ్నార్థకం



చిన్నకొల్వాయి ఎత్తిపోతల పథకం వద్ద అడుగంటిన గోదావరి



గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం

సారంగాపూర్(జగిత్యాల): ఎత్తిపోతల పథకం కింద యాసంగి పంటల సాగుపై సందిగ్ధం నెలకొంది. గోదావరి జలాలు అడుగంటి పోవడంతో నదిని ఆనుకుని ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాలకు నీరందడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని రాయికల్, బీర్‌పూర్, ధర్మపురి, వెల్గటూర్ మండలాల పరిధిలో గోదావరి ఒడ్డున 10 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. నదిలో ఆశించిన మేర నీరు ఉంటేనే ఎత్తిపోతలకు ఏర్పాటు చేసిన మోటార్లతో పంటలకు నీరు అందించేందుకు వీలుంటుంది. అయితే ప్రస్తుతం గోదావరిలో నీటి ప్రవాహం జీరోకు చేరింది.

నాలుగు మండలాల పరిధిలో..

బీర్‌పూర్ మండలం కమ్మునూర్, మంగేళ, రేకులపల్లి, చిన్నకొల్వాయి గ్రామాల్లోని గోదావరినది ఒడ్డున ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేశారు. అలాగే రాయికల్ మండలం జగన్నాథ్‌పూర్, ధర్మపురి మండలం దమ్మన్నపేట, స్తంభంపల్లి, తిమ్మాపూర్, రాయపట్నంతో పాటు వెల్గటూర్ మండలంలో ఎత్తిపోతల కింద సుమారు 25 వేల ఎకరాలకు సాగునీరు అవసరం ఉంది. కాగా, 2023 ఆగస్టు, సెప్టెంబర్ మొదటి వారం వరకు మాత్రమే వర్షాలు కురిశాయి. వర్షాలు సమృద్ధిగా కురవకపోవడంతో ఈసారి గోదావరి ప్రవాహం గత డిసెంబర్ నుంచి జీరోకు చేరింది.

ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తేనే..

గతంలో ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఎత్తిపోతల పథకాల కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి రోజూ 1,000 క్యూసెక్కుల చొప్పున 11 రోజులు ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోతల పథకాల కోసం విడుదల చేసేదని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సారి డిసెంబర్‌లోనే గోదావరి ఎండిపోవడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి రోజు వెయ్యి క్యూసెక్కుల చొప్పున 10 నుంచి 11 రోజుల పాటు నదిలోకి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. కాగా ఎస్సారెస్పీలో 85 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

విప్ పర్యటనతో చిగురించిన ఆశలు

రెండు రోజుల క్రితం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చిన్నకొల్వాయి ఎత్తిపోతల పథకాన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులు, రైతులతో మాట్లాడారు. ఎత్తిపోతల పథకాల కోసం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి 1 టీఎంసీ నీటి విడుదలకు నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవిస్తానని పేర్కొడంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు.

ఎస్సారెస్పీ నీరు విడుదల చేయండి



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి విన్నవిస్తున్న విప్ లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల/ధర్మపురి: గోదావరి లిఫ్ట్‌లపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులు నదిలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నారని, ఎస్సారెస్పీ నుంచి ఒక టీఎంసీ నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వినతిపత్రం అందజేశారు. గోదావరినదిపై సదర్‌ఘాట్ వద్ద గేట్ల నిర్మాణం కారణంగా జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గ ప్రాంతాలకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. 16 గ్రామాల పరిధిలో సుమారు 25 వేల ఎకరాల భూమిని సాగుచేసుకోలేక పోతున్నారని, పరిస్థితిని సమీక్షించి ఒక టీఎంసీ నీటిని నదిలోకి విడుదల చేసేలా అధికారులను ఆదేశించాలని మంత్రికి విన్నవించగా, సానుకూలంగా స్పందించినట్లు విప్ పేర్కొన్నారు.

ఎత్తిపోస్తేనే పంటల సాగు



నాకున్న ఎనిమిది ఎకరాల భూమి ఎత్తిపోతల ద్వారానే సాగవుతుంది. గోదావరిలో నీరు లేదు. ఇప్పటికీ యాసంగి పంటల సాగును ప్రారంభించలేదు. వరినార్లు పోసి ఉంచాం. ఎత్తిపోతల మోటార్లు నడిస్తేనే పంటలు సాగవుతాయి.

– రౌతు సత్తయ్య, రైతు, కొల్వాయి, బీర్‌పూర్

గతంలో కూడా ఇదే పరిస్థితి



గతంలో కూడా గోదావరిలో నీరు అడుగంటి ఇలాంటి పరిస్థితులు చోటుచేసుకున్నాయి. అయితే అప్పుడు పంటల సాగుకు గోదావరిలోకి నీటిని వదిలారు. ఇప్పుడు కూడా ప్రభుత్వం నీటి విడుదలకు సానుకూలంగా ఉంటుందని భావిస్తున్నం.

– చక్రూనాయక్, డీఈ, ఎస్సారెస్పీ

క్లుప్తంగా

కలెక్టర్, అగ్రికల్చర్ అధికారులను ప్రాసిక్యూట్ చేయాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



రాయికల్(జగిత్యాల): రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో పనిచేసిన కలెక్టర్, అగ్రికల్చర్ అధికారులను ప్రాసిక్యూట్ చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా రాయికల్‌లో మట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో జీవోలకు విరుద్ధంగా భూమి సాగు చేయని రైతులకు సైతం అధికారులు రైతుబంధు పథకం కింద నిధులు మంజూరు చేశారని, దీంతో వేలాది కోట్ల నిధులు దుర్వి నియోగమయ్యాయని ఆరోపించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.2 లక్షల రుణమాఫీ చేస్తున్నారని గుర్తుచేశారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని కిసాన్‌నగర్‌కు చెందిన రావుల చారి(55) చాలాకాలంగా భార్యాపిల్లలకు దూరంగా ఉంటున్నాడు. శుక్రవారం పెద్దపల్లి పట్టణ శివారులోని పెద్దపల్లి–మంథని రైల్వే వంతెన సమీపంలో నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడ్డాడు. అతని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి వద్ద లభించిన ఫోన్ నంబర్ ఆధారంగా అతని కుమారుడు సందీప్‌కు సమాచారం ఇచ్చి, మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

వలకు చిక్కిన కొండచిలువ



జగిత్యాలరూరల్: ధరూర్ శివారులోని వాగులో శుక్రవారం మత్స్యకారులు చేపలు పట్టేందుకు వల విసిరారు. అందులో భారీ కొండచిలువ చిక్కింది. స్థానికుల సహాయంతో బయటకు తీసి, అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వారు కొండచిలువను అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు.

కోతులకు ఆహారం.. వాహనదారుకు జరిమానా

భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిపై భీమారం సమీపంలో శుక్రవారం కోతులకు ఆహారం అందించిన వాహనదారుకు రూ.3వేల జరిమానా విధించినట్లు మంచిర్యాల ఎఫ్‌డీవో సర్వేశ్వర్ తెలిపారు. కరీంనగర్ జిల్లా ముగ్దుంపూర్‌కు చెందిన బండి ఓదెలు వాహనంలో వెళ్తూ అటవీ ప్రాంతంలో కోతులు కనిపించగానే వాటికి ఆహారం వేశాడని తెలిపారు. దీంతో ఆయనకు జరిమానా విధించామన్నారు. వాహనచోదకులు, ప్రయాణికులు రిజర్వు ఫారెస్టులో రోడ్డుపై సంచరించే కోతులకు ఆహారం వేయొద్దని సూచించారు.

గుట్టు విప్పేదెప్పుడో..?

- జాడలేని పోస్టుమార్టం రిపోర్టులు
- పెద్దాపూర్ గురుకులంలో వీడని భయం
- విద్యార్థులను బడికి పంపని తల్లిదండ్రులు
- సందేహాల తొలగింపులో అధికారుల నిర్లిప్తత



పెద్దాపూర్ గురుకులంలో జాగ్రత్త చర్యల్లో భాగంగా బావి పూడ్చుతున్న దృశ్యం

కోరుట్ల: ఇద్దరు విద్యార్థుల మృతి.. మరో ఆరుగురికి అస్వస్థత. ఆరు నెలల వ్యవధిలో వరుసగా మూడు ఘటనలు. కోరుట్ల మండలం పెద్దాపూర్ గురుకులంలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎక్కడాలేని భయాందోళనలు. గురుకులంలో వరుసగా ఎందుకిలా జరుగుతుందన్న విషయంలో లెక్కలేని సందేహాలు.. అధికార యంత్రాంగం ఈ గుట్టు విప్పేందుకు సరైన రీతిలో స్పందించడంలో లేదన్న అనుమానాలు.. వెరసి పెద్దాపూర్ గురుకులంలో ఏం జరుగుతుందో అంతుచిక్కని అనిశ్చితి. డిసెంబర్ నెలలో ఇద్దరు విద్యార్థులు పాము కాటుకు గురై క్షేమంగా ఉన్నప్పటికీ, తల్లిదండ్రులు పాఠశాలకు తమ పిల్లలను పంపే విషయంలో భరోసా లేక బెదిరిపోతున్నారు.

ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదికలు ఏవి..?

పెద్దాపూర్ గురుకులంలో మొదటగా గత జూలై 25న 8వ తరగతి విద్యార్థి గణాదిత్య విషపురుగు కుట్టి మృతి చెందాడు. స్థానిక వైద్యాధికారులు పోస్టుమార్టం పరీక్షలు నిర్వహించారు. ఈ నివేదిక ఏమిటన్న విషయంలో ఇప్పటికీ తెలియరాలేదు. తర్వాత ఆగస్టు 8న ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి ఎడ్మల అనిరుధ్ మృతిచెందాడు. ఆ సమయంలోనూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ రెండు సందర్భాల్లోనూ నిర్వహించిన పోస్టుమార్టం నివేదికల గుట్టు ఇప్పటికీ తేలలేదు. ఈ రెండు ఘటనల్లోనూ పాము కాట్లు ఉన్నాయన్న అనుమానంతో మరో నలుగురు విద్యార్థులకు యాంటి స్నేక్ వీనమ్ ట్రీట్‌మెంట్ ఇచ్చారు. వారంతా కోలుకుని బాగానే ఉన్నారు. ఇదే క్రమంలో పెద్దాపూర్ గురుకుల ఆవరణ పరిసరాలు, ఫర్నిచర్ ఏర్పాటుతో పాటు పెద్ద ఎత్తున జాగ్రత్త చర్యలు చేపట్టారు. పూర్తి స్థాయిలో గురుకుల పరిసరాలు బాగుపడ్డాయని తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకునే లోపే..డిసెంబర్ 18న మరో ఇద్దరు విద్యార్థులు గుర్తు తెలియని విషపురుగు కుట్టి అస్వస్థత పాలయ్యారు. మళ్లీ వైద్యాధికారులు యాంటి వీనమ్ ట్రీట్‌మెంట్‌ను ఆశ్రయించి చికిత్స అందించగా వారిద్దరూ కోలుకున్నారు. మళ్లీ తల్లిదండ్రుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. పూర్తి స్థాయిలో అవాంఛనీయ ఘటనలు ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలని ఆందోళనలో ఉన్నారు.

తల్లిదండ్రులను వీడని భయం

గురుకులంలో ఇద్దరు విద్యార్థుల మృతికి కారణాలు వెల్లడి కాకపోవడంతో తల్లిదండ్రుల్లో భయం వీడటం లేదు. పెద్దాపూర్ గురుకులంలో 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 504 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వరుస సంఘటనలు చోటు చేసుకోవడంతో ప్రస్తుతం పాఠశాలకు వస్తున్న విద్యార్థుల సంఖ్య కేవలం 210 మందికి తక్కువగానే ఉన్నట్లు సమాచారం. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించేందుకు సిద్ధంగా ఉన్నా, ఇద్దరు విద్యార్థుల మృతి, ఆరుగురి అస్వస్థతకు కారణాలు ఏమిటన్న విషయాన్ని ఎవరూ తేటతెల్లం చేయకపోవడం సమస్యగా మారింది. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ ల్యాబ్ రిపోర్టుల్లో ఏమి తేలిందన్న అంశం స్పష్టంగా అధికారులు వెల్లడించి విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు రావన్న భరోసా ఇవ్వగలిగితేనే పెద్దాపూర్ గురుకులం మళ్లీ గాడిన పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంటర్ విద్యార్థుల కొట్లాట

ఓ వైపు విద్యార్థుల ఆకస్మిక మృతితో పెద్దాపూర్ గురుకుల ప్రతిష్ట దిగజారుతున్న క్రమంలో విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించడం మరో సమస్యగా మారింది. రెండు రోజుల క్రితం ఓ ఇంటర్ విద్యార్థిని మరో నలుగురు విద్యార్థులు కొట్టినట్టు సమాచారం. ఈ క్రమంలో ఐదుగురు విద్యార్థులను కొన్నాళ్ల పాటు పాఠశాల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిసింది.

నట్టల నివారణ మందులేవి?

- రెండేళ్లుగా పశువులకు అందని మందులు
- ప్రైవేటు దుకాణాలే దిక్కు
- పశువుల కాపరులపై ఆర్థిక భారం
- సిరిసిల్ల జిల్లాలో గేదెలు 1.12 లక్షలు
- గొర్రెలు, మేకలు 3.84లక్షలు



గొర్రెల మంద



ఇతను ముస్తాబాద్‌కు చెందిన గొర్రెలకాపరి బండారి పర్శరాములు. నలభై ఏళ్లుగా గొర్రెల కాపరిగా పనిచేస్తూ ఉపాధి పొందుతున్నాడు. మూడేళ్లుగా తన గొర్రెలకు సొంతంగానే నట్టల నివారణ మందు కొని వేయిస్తున్నాడు. ఆరు నెలలకోసారి రూ.4వేలు వెచ్చిస్తున్నాడు. ఒక్కోసారి నట్టల నివారణ మందులు సకాలంలో వేయక నష్టం కూడా జరిగింది.

ముస్తాబాద్(సిరిసిల్ల): పశువుల్లో నట్టల నివారణ మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో దొరకడం లేదు. పశుపోషకులు ప్రైవేట్ దుకాణాలలో కొంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. గత రెండున్నరేళ్లుగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నట్టల నివారణ మందుల పంపిణీ నిలిచిపోయింది. దీంతో వేలాది పశువులు నట్టల వ్యాధితో బాధపడుతున్నాయి. ఎదుగుదల లోపించి గొర్రెలు, మేకల కాపలాదారులకు వ్యాపారం సరిగ్గా జరగడం లేదు.

డీవార్మింగ్‌కు దూరమే..

గతంలో పశుసంవర్ధకశాఖ అధికారులు పాడిరైతులు, గొర్రెల కాపరుల వద్దకు వెళ్లి వారు పెంచుతున్న జీవాలకు నట్టల నివారణ మందులు వేసేవారు. నాలుగేళ్ల క్రితం వరకు పశువులు, గొర్రెల మందల వద్దకే అధికారులు నట్టల నివారణ మందు తీసుకెళ్లి వేసేవారు. రెండున్నరేళ్లుగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం అటకెక్కించింది. ఫలితంగా పశుపోషకులే సొంతంగా కొని వారి జీవాలకు వేయిస్తున్నారు .

జిల్లాలో పశువులు..
గేదెలు : 1.12 లక్షలు
గొర్రెలు : 3.10 లక్షలు
మేకలు : 74వేలు
కోళ్లు :1.10లక్షలు

మందులు ఇలా వేయాలి..

- దూడలు పుట్టిన ఏడు రోజుల్లోపే నట్టల నివారణ మందులు వేయాలి.
- గొర్రెలు, మేకలకు మూడు నుంచి నాలుగు నెలలకోసారి వేయాలి.
- పేడ పరీక్షలు చేసి, గుడ్లు కనిపిస్తే నట్టల నివారణ మందులు వేయాలి.
- గుమ్మడి పువ్వులను తినిపిస్తే కూడా నట్టల నివారణ చేయవచ్చు.
- లేగదూడలకు నట్టల నివారణ మందులు వేసి వాటి మరణాన్ని ఆపవచ్చు.
- వానాకాలంలో తొలకరి జల్లులు కురిసిన సందర్భంలో పచ్చగడ్డి మేసి జీవాలు, పశువుల్లో నట్టలు చేరే అవకాశం ఉంది. ఆ సమయంలో మందులు వేయాలి.

మందులు పంపిణీ చేయాలి



గత ప్రభుత్వం నట్టల నివారణ మందుల పంపిణీని నిలిపి వేసింది. గొర్రెల కాపరులు, పాడిరైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. కాంగ్రెస్ సర్కార్ పశు వైద్యంపై దృష్టి పెట్టాలి. ఆరు నెలలకోసారి నట్టల నివారణ మందులు వేయాలి.

– ఎలుసాని దేవయ్య, ముస్తాబాద్

రెండున్నరేళ్లుగా లేవు

రెండున్నరేళ్లుగా పశువుల్లో నట్టల నివారణ మందుల పంపిణీ నిలిచిపోయింది. ఎవరైన గొర్రెల కాపరులు, పాడిరైతులు వస్తే వారికి మందులు సూచిస్తున్నాం. ఉన్నతాధికారులకు మందుల కోసం ప్రతిపాదనలు చేశాం. మందులు రాగానే పంపిణీ చేస్తాం.

– డాక్టర్ రవీందర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి

‘ఫీజు’ బకాయిలు విడుదల చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

కరీంనగర్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ సంక్షేమ, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు శుక్రవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ.5 వేల కోట్లకు పైగా, జిల్లాలో బీసీ విద్యార్థులకు రూ.131.35 కోట్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు రూ.171 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రావాల్సి ఉందన్నారు. గత మూడేళ్లలో రీయింబర్స్‌మెంట్ కోసం 1.30 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలోని 16.70 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రూ.9,200 కోట్లు మాత్రమే కేటాయించిందని, అవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. బకాయిలు చెల్లించకుంటే మంత్రులు, ఎమ్మెల్యేల కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందించారు. బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, మహిళా అధ్యక్షురాలు గుంటి స్వరూప, బీసీ యువజన సంఘం నగర అధ్యక్షుడు అనుమాస నితిన్, యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్, బీసీ యువజన సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ లింగంపల్లి శ్రీనివాస్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



కోరుట్ల: పట్టణంలోని ఝాన్సీ రోడ్‌లో గల ఓ సినిమా థియేటర్ వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతుడి వయసు 45 నుంచి 50 ఏళ్లు ఉంటుందన్నారు. గుర్తుపట్టిన వారు కోరుట్ల సీఐ నంబర్ 87126 56820, ఎస్సై నంబర్ 87126 56820కు ఫోన్ చేయాలని సూచించారు.

ఆమె కళ్లు సజీవం



సరళ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్): జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీకి చెందిన పున్నం సరళ (62) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందింది. సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, ఉప్పుల మహేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కల్వల దీప్తి కిషన్‌రెడ్డి మృతురాలి కుటుంబసభ్యులకు నేత్రదానంపై అవగాహన కల్పించగా ఒప్పుకున్నారు. వరంగల్ ఎల్‌వీపీ టెక్నీషియన్ ప్రదీప్ సహకారంతో నేత్రాలను సేకరించి, హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు పంపించారు. సరళ భర్త రామ్‌రెడ్డి, కూతురు–అల్లుడు మంద పద్మ–ప్రవీణ్‌రెడ్డి, కుమారుడు అనిల్‌కుమార్‌లను అభినందించారు.

కోతుల దాడి.. విరిగిన విద్యార్థి కాళ్లు



రెండు కాళ్లు విరిగిన రఘువర్ధన్

కరీంనగర్: కరీంనగర్ జిల్లాకేంద్రంలోని మంకమ్మతోట ధన్గర్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులపై కోతులు చేశాయి. గురువారం సాయంత్రం కొంత మంది విద్యార్థులు పాఠశాలలోని రెండో అంతస్తులో ఉన్నారు. కోతుల గుంపుగా ఒక్కసారిగా వీరిపైకి చేరుకోవడంతో బెంబేలెత్తి తలోదిక్కు పారిపోయారు. కోతుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఎనిమిదో తరగతి చదువుతున్న మద్ది రఘువర్ధన్ మొదటి అంతస్తు నుంచి జారి కింద పడ్డాడు. అతని రెండుకాళ్లు, వెన్నుపూస విరిగింది. పాఠశాల ఉపాధ్యాయ బృందం, 55వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం అర్ధరాత్రి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి రెఫర్ చేశారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో స్వర్ణం



సంజన

కరీంనగర్ స్పోర్ట్స్: సీఎం కప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కరీంనగర్ జీఆర్‌ఆర్ కరాటే అకాడమీ విద్యార్థిని మర్రి సంజన సత్తా చాటి, గోల్డ్ మెడల్ సాధించినట్లు కరాటే జిల్లా జట్టు మేనేజర్ ఐలయ్య తెలిపారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో గత నెల 31 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు నిర్వహించిన పోటీల్లో సీనియర్ బాలికల 55 కేజీలలోపు కేటగిరీలో సంజన పతకం గెలిచిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వి.శ్రీనివాస్ గౌడ్, ఒలింపిక్ సంఘం జిల్లా కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, కోచ్ గౌరు రాజిరెడ్డి తదితరులు శుక్రవారం అభినందించారు.

‘అల్ఫోర్స్’లో సావిత్రిబాయి పూలేకు నివాళి



నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి(కరీంనగర్): స్థానిక అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళి అర్పించారు. మన దేశంలో తొలి మహిళా టీచర్‌గా సావిత్రిబాయి ప్రత్యేక గుర్తింపు పొందారని, ఆమె ఆశయసాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని టీచర్లు సూచించారు. తన రచనల ద్వారా స్త్రీలను జాగృతం చేసి, విద్యారంగంలో రాణించేలా చూశారని కొనియాడారు. భర్త జ్యోతిబాపూలేతో కలిసి, గ్రామాల్లో పర్యటించి, మహిళలను చైతన్యపరిచారని, స్త్రీ విద్య కోసం పలు పాఠశాలలను స్థాపించారని తెలిపారు.

మద్యానికి బానిసైన కొడుకులు

- మనస్తాపంతో పురుగుల మందు తాగిన తండ్రి
- చికిత్స పొందుతూ మృతి



గంగాధర్ (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): చేతికంది వచ్చిన కొడుకులు మద్యానికి బానిసగా మారి జులాయిగా తిరుగుతుండడంతో మనస్తాపం చెందిన తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన బలాస్థి గంగాధర్(48)కు ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా జులాయిగా తిరగడానికి అలవాటుపడ్డారు. తండ్రి ఎన్నిసార్లు చెప్పినా వారి ప్రవర్తనలో మార్పు రాలేదు. డిసెంబర్ 31న ఇద్దరు కొడుకులు బాగా మద్యం తాగి తండ్రితో గొడవకు దిగారు. దీంతో మనస్తాపం చెందిన గంగాధర్ పురుగుల మందు తాగాడు. అతడిని బంధువులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజన్న సన్నిధి.. భక్తుల రద్దీ



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ: ఎములాడ రాజన్నను శుక్రవారం దాదాపు 25 వేల మంది భక్తుల దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి, కోడెమొక్కు చెల్లించుకున్నారు. నిలువెత్తు బెల్లం పంపిణీ చేశారు. స్వామివారికి అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణం, సత్యనారాయణ వ్రతం జరిగాయి. అనంతరం బద్దిపోచమ్మకు బోనం మొక్కులు, అనుబంధ దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

సోలార్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు 10 మెగావాట్ల సోలార్ ప్లాంట్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పొగ రావడంతో అధికారులు ఎన్టీపీసీ సీఐఎస్ఎఫ్ అగ్నిమాపక విభాగానికి సమాచారం అందించారు. సిబ్బంది రెండు ఫైరింజిన్ల సాయంతో మంటలు ఆర్పివేశారు. అయితే, ప్లాంట్‌లో విద్యుదుత్పత్తికి ఉపయోగించే బ్యాటరీ పేలడంతో ప్రమాదం జరిగినట్లు సమాచారం.

పండుగ పూట ప‘రేషన్’

- సమ్మెలో సివిల్ సప్లయ్ హమాలీలు
- గోదాముల్లోనే బియ్యం నిల్వలు
- రేషన్ దుకాణాలకు 50 శాతం చేరని వైనం
- కార్డుదారులకు సకాలంలో అందేనా?

జిల్లాలో గ్రామాలు: 313
మొత్తం జనాభా: 10,09,234
రేషన్ కార్డులు: 2,74,620
యూనిట్లు: 8,17,156
రేషన్ దుకాణాలు: 566



ఇది నగరంలోని వావిలాలపల్లిలోని రేషన్ దుకాణం. ఇంకా రేషన్ బియ్యం రాకపోవడంతో ఇలా మూసివేశారు. ఈ నెలలో ఒక్కొక్కరికి 6కిలోల బియ్యం పంపిణీ కావాల్సి ఉండగా ఇంకా మూవ్‌మెంట్ కాకపోవడంతో కార్డుదారులకు నిరీక్షణ తప్పడం లేదు.

కరీంనగర్ అర్బన్: పండుగపూట కార్డుదారుల ప‘రేషన్’ మొదలైంది. మరికొద్ది రోజుల్లో సంక్రాంతి పండుగ కాగా.. ప్రతీ ఇంట పిండి వంటల కోలాహలం నెలకొననుంది. పిండి వంటలకు బియ్యమే కీలకం కాగా ఇంకా రేషన్ దుకాణాల్లో పంపిణీ లేకపోవడం ఆందోళనకు గురి చేస్తోంది. ప్రతినెలా 1వ తేదీ నుంచి 15వరకు పంపిణీ చేయడం జరిగే ప్రక్రియ. బియ్యం ఇంకా రేషన్ దుకాణాలకు చేరకపోవడం గమనార్హం. ఈ నెల 1నుంచి హమాలీలు సమ్మెలో ఉండగా, మూవ్‌మెంట్ నిలిచిపోయింది. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్లలో బియ్యం నిల్వలు పేరుకుపోగా కార్డుదారులకు పడిగాపులు తప్పడం లేదు.

పిండి వంటలకు పడిగాపులు

జిల్లాలో 566 రేషన్ దుకాణాలుండగా 2.74లక్షల మంది కార్డుదారులున్నారు. ఇప్పటివరకు కేవలం 50శాతం దుకాణాలకు మాత్రమే బియ్యం చేరగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా చేరలేదని సమాచారం. కరీంనగర్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మండలస్థాయి నిల్వ కేంద్రాల ద్వారా రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా చేస్తారు. అత్యధికంగా కరీంనగర్ పాయింట్ నుంచి 218ల దుకాణా లుండగా మిగతా దుకాణాలు హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి పరిధిలో ఉన్నాయి. అయితే 250కి పైగా రేషన్ దుకాణాలకు పూర్తిస్థాయిలో బియ్యం రాకపోవడం గమనార్హం. పిండి వంటలు చేసేందుకు గృహిణులు సిద్ధమవుతుండగా బియ్యం పంపిణీయే లేకపోవడం విస్తుగొల్పుతోంది.


ప్రత్యామ్నాయ చర్యలేవి?

సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కూలీ రేట్ల జీవోను విడుదల చేయాలని హమాలీలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పలుమార్లు ఆందోళనలు చేపట్టగా ఆ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ క్రమంలో కూలీ రూ.29ఇస్తామని ప్రభుత్వం ఒప్పుకుందని, కానీ ఆ జీవోను ఇప్పటివరకు విడుదల చేయలేదని చెబుతున్నారు. గత నెలలో సమ్మె నోటీస్ ఇవ్వగా ఈ నెల 1 నుంచి సమ్మెలో కూర్చున్నారు. దీంతో మూవ్‌మెంట్ ప్రక్రియ నిలిచిపోగా రేషన్ దుకాణాల్లో బియ్యం లేవు. ఈ నేపథ్యంలో హమాలీల డిమాండ్లను నెరవేర్చుతారా లేదా ప్రత్యామ్నాయ చర్యలతో మూవ్‌మెంట్ పూర్తి చేస్తారా అన్నది స్పష్టత లేదు.

పాపం.. రేషన్ డీలర్లు, కార్డుదారులు

రేషన్ దుకాణాలకు బియ్యం ఆలస్యంగా వస్తుండటంతో డీలర్ల బాధ వర్ణనాతీతం. పండుగ లేదు.. శుభకార్యాలు లేకుండా రేషన్ దుకాణంలోనే కాలం గడుపుతున్నారు. కొంత బియ్యం ఒకసారి మరికొంత బియ్యం మరోసారి పంపిస్తుండటంతో సాధ్యమైనంత వరకు పంపిణీ చేస్తున్నా పూర్తిస్థాయిలో పంపిణీ జరగడం లేదు. దీంతో కమిషన్‌తోనే బతుకు వెళ్లదీయాల్సిన డీలర్లు గిట్టుబాటు కాక ఉసూరుమంటున్నారు. ఇక కార్డుదారులు బియ్యం కోసం రేషన్ దుకాణాలకు చుట్టూ తిరగడం ఆందోళనకర పరిణామం.

ఇబ్బందులు పడుతున్నం



సరియైన ప్రణాళిక లేకపోవడంతో డీలర్లు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి నెలా చివరి తేదీలోపే బియ్యం మూవ్‌మెంట్ కావాల్సి ఉండగా ఆలస్యమవుతోంది. ఉన్నతాధికారులు చొరవ చూపి ఎవరికి ఇబ్బంది లేకుండా చూడాలి.

– రొడ్డ శ్రీనివాస్, తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు